కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న దేవేంద్రరావు

కైకలూరు : విద్యారంగంలో పలు విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆర్ట్, వర్క్,హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్ టైమ్, కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు దేవేంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేసే వీరిని ఒకేషనల్ ఉపాధ్యాయులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.32,670 అందించాలన్నారు. బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బోస్, బాబు, చంటమ్మ, సతీష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బదిలీల మాయాజాలం..!

నిబంధనల ముసుగులో ఇష్టారాజ్యం
పరిపాలనా అవసరాల రీత్యా పేరిట అడ్డగోలు బదిలీలు
పెద్దఎత్తున సొమ్ము చేతులు మారినట్లు ఆరోపణలు
బదిలీలపై సమాచారం ఇచ్చేందుకు అధికారుల వెనుకంజ
శాఖల వారీగా బదిలీల జాబితా బయటపెడితేనే వాస్తవాలు వెలుగులోకి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో బదిలీల ప్రక్రియ ఓ మాయాజాలంలా మారింది. నిబంధనల ముసుగులో తమకు నచ్చినవారికి నచ్చినచోట పోస్టింగులు ఇస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీల సమాచారం ఇచ్చేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్న తీరు సైతం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ బదిలీలలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకేచోట ఐదేళ్ల కాలం పూర్తి చేసుకున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరని, ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు రిక్వెస్ట్ ప్రాతిపదికన బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. అదే సమయంలో మరో అంశాన్ని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో భాగంగా పని చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులను బదిలీ చేసే అవకాశాన్ని ఇచ్చింది. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో భాగంగా అనే అంశాన్ని పలు శాఖల్లో అధికారులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నారని, బదిలీల ప్రక్రియను ఇష్టానుసారంగా మార్చేశారని తెలుస్తోంది. ఒకేచోట రెండేళ్లు పూర్తికాని ఉద్యోగులను అడ్మినిస్ట్రేటివ్ అంశం అంటూ బదిలీల జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. అడ్మినిస్ట్రేటివ్ అనే అంశం వర్తించాలంటే సదరు అధికారి పని చేయకుండా, రిమార్కు ఉంటేనే వర్తిస్తుందని చెబుతున్నారు. అదీ పెద్ద కేడర్‌లో ఉన్న అధికారులకే ఇది వర్తించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. బదిలీల ప్రక్రియలో అవన్నీ పక్కనపెట్టి అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ ప్రాతిపదికన అంటూ ఇష్టానుసారంగా బదిలీలు చేసినట్లు తెలుస్తోంది. రెవెన్యూ, పంచాయతీరాజ్ ఇలా బదిలీల ప్రక్రియ జరిగిన అన్ని శాఖల్లోనూ ఈ తంతు నడిచినట్లు చెబుతున్నారు. ఈ ప్రక్రియలో పెద్దఎత్తున మామూళ్లు చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది. తమకు నచ్చిన అధికారులను నచ్చిన చోటుకు బదిలీ చేసినట్లు చెబుతున్నారు. బదిలీల తంతుపై ఉద్యోగుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. ఎంఎల్ఎలు, మంత్రుల సిఫార్సు లేఖలు ఉంటే చాలు నిబంధనలతో సంబంధం లేకుండా ఏదోకటి పేర్కొంటూ బదిలీ చేసేసినట్లు సమాచారం.

బదిలీల జాబితాను బయట పెడతారా..?

ఉద్యోగులు బదిలీల ప్రక్రియ పూర్తయినట్లుగా అధికారులు చెబుతున్నారు. పలు శాఖలకు సంబంధించి పోస్టింగులు ఇచ్చేయడం, ఉద్యోగులు చేరిపోవగడం కూడా జరిగిపోతుంది. అయితే ఏ శాఖలో ఎంతమంది బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఉద్యోగులకు సంబంధించిన జాబితాను మాత్రం అధికారులు బయటపెట్టడం లేదు. గతంలో ఎంపిడిఒ, తహశీల్దార్ల బదిలీలతో పాటు అన్నిశాఖలకు సంబంధించిన బదిలీల జాబితాలను మీడియాకు ఇచ్చేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. బదిలీల ప్రక్రియ అంతా గోప్యంగా సాగుతున్న పరిస్థితి నెలకొంది. జాబితా బయటపెడితే బదిలీల్లో డొల్లతనం బయటపడే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో భాగంగా బదిలీ చేస్తే అందుకు సంబంధించిన రిమార్కులు రాయాల్సి ఉంటుంది. అలాంటి అధికారులు ఎంతమందిని బదిలీ చేశారో వివరాలు బయటపెడితే బదిలీలో పారదర్శకత ఎంతో తేలనుంది. రెండేళ్ల సర్వీసు పూర్తికాని ఉద్యోగులంతా రాజకీయ, అధికారుల పలుకుబడి ఉపయోగించుకుని నచ్చినస్థానానికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా బదిలీల ప్రక్రియకు సంబంధించిన జాబితాను శాఖల వారిగా బయటపెట్టాలని అంతా కోరుతున్నారు.


నినదిస్తున్న గ్రామస్తులు

రొయ్యల చెరువు తవ్వకం ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - మండవల్లి

రొయ్యల చెరువుల తవ్వకాలను నిలుపుదల చేసి తాగునీటి వనరులు కలుషితం కాకుండా చూడాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని కానుకొల్లు గ్రామస్తులు హెచ్చరించారు. ఆక్వా చెరువు తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరుతూ కానుకొల్లు కాలనీ వాసులు స్థానిక విఆర్ఒ కార్యాలయం ఎదుట గురువారం బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కానుకొల్లులోని తాగునీటి బావిపై ఆధారపడి సుమారు నాలుగొందల కుటుంబాలు దాహార్తి తీర్చుకుంటున్నాయని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ బావి నీటిపైనే ఆధారపడి ఉన్నాయని వివరించారు. అయితే గ్రామానికి ఆనుకుని ఉన్న పంట భూముల్లో ఓ రాజకీయ నాయకుడు పంట భూములను రొయ్యల చెరువుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. ఇప్పటికే గ్రామం చుట్టూ అనుమతులు లేకుండా తవ్విన రొయ్యల చెరువుల వల్ల గ్రామంలో ఉన్న మూడు బావుల్లో రెండింటిలో నీళ్లు పూర్తిగా కలుషితమైపోయాయని, మిగిలిన ఒక్క బావిపైనే ఆధారపడి దాహార్తి తీర్చుకుంటున్నామని తెలిపారు. ఇప్పుడు ఊరికి ఆనుకునే ఉన్న పొలాలను రొయ్యల చెరువులుగా మార్చేస్తే గ్రామస్తులకు తాగునీరందక నానావస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు తవ్వకాలను అడ్డుకుని తాగునీటి బావి కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం విఆర్ఒ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై చంద్రశేఖరరావు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

మట్టి అక్రమ తవ్వకాలపై నిఘా

అనుమతుల్లేకుండా మట్టి, కంకర తవ్వితే కఠిన చర్యలు
తహశీల్దార్ ఎవి.రమణారావు
ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో అనుమతులు లేకుండా మట్టి, కంకర తవ్వకాలు జరగకుండా విఆర్ఒలు నిరంతరం నిఘా ఉంచాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ ఎవి.రమణారావు ఆదేశించారు. యథేచ్ఛగా మట్టి తవ్వకాలు అనే శీర్షికన ఈ నెల 1న ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. గత నెల 28న తిమ్మయ్యపాలెం శివారు కొత్తగూడెంలో మట్టి తవ్వుతున్నారనే సమాచారంతో గోపీనాథపట్నం, గొల్లగూడెం గ్రామాల రెవెన్యూ అధికారులు సదరు ప్రాంతానికి వెళ్లారన్నారు. అక్కడ మట్టి లోడుతో ఉన్న రెండు లారీలు, ఒక ఖాళీ లారీ మొత్తం మూడు లారీలను గుర్తించి వాటిని సీజ్ చేసి చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. మళ్లీ గత నెల 30న చేబ్రోలు రెవెన్యూ పరిధిలో మట్టి తవ్వుతున్నారనే సమాచారంతో ఏలూరు విజిలెన్స్, ఉంగుటూరు రెవెన్యూ సిబ్బంది సంయుక్త దాడిలో ఒక జెసిబి, ఒక లారీని సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయంలో కస్టడీలో ఉంచామన్నారు.

బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాల్సిందే

మహిళా రెజ్లర్లకు న్యాయం కోరుతూ ప్రజాసంఘాల నిరసన

ఏలూరులో సిఐటియు ఆధ్వర్యాన..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని, వారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జన్మభూమి పార్క్ సెంటర్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, శ్రామిక మహిళ నాయకులు పి.హైమావతి, రైతుసంఘం నాయకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధులను పోలీసులు అమానుషంగా అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. దేశానికి పతకాలు తెచ్చిన మహిళా యోధులకే రక్షణ లేకపోతే సాధారణ మహిళలకు ఏం రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. నిరసన తెలిపే రెజ్లర్లకు రక్షణ కల్పించాలని, రిటైర్డ్ సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు నిర్వహించాలని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు నెలలుగా ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు అండగా ఉంటామని, భవిష్యత్తులో వారు నిర్వహించే పోరాటాలకు మద్దతుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, నేతలు వి.సాయిబాబు, కె.విజయలక్ష్మి, సిహెచ్.సుందరయ్య, కోటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన..

ఏలూరు టౌన్: సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి మద్దతుగా వారికి న్యాయం చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో మన దేశానికి అనేక పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులకు, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే బిజెపి ప్రభుత్వానికి మహిళల పట్ల గౌరవం లేదని విమర్శించారు. ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండేటి దేవి, మాట్లాడగా నేతలు ఉప్పులూరి హేమశంకర్, సుబేదార్‌ఖాన్, ఎంఎ.హకీమ్, అజీజ్, అబ్దుల్ రషీద్, అహ్మద్ ఆలీ, శాయన అభిలాష్, వేముల శ్రీను, గాలి నాగరాజు, బుగ్గల ప్రభాకర్, పోలా భాస్కరరావు, సామన శ్రీరాములు, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, కొల్లూరి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మీ భవాని, గుల్లిపల్లి రేవతి, కె.కృష్ణమాచార్యులు, వెంకటయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో సిపిఐ ఆధ్వర్యాన..

ముసునూరులో..

ముసునూరు: దేశానికి బంగారు పతకాలు తీసుకువచ్చే క్రీడాకారులపై దౌర్జన్యం అన్యాయమని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య అన్నారు. గురువారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో ప్రజా సంఘాలు, అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం, అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వేముల బక్కయ్య మాట్లాడుతూ రైజర్లు బాగుంటేనే దేశ ప్రగతికి మంచి పతకాలు తీసుకువస్తారని, అలాంటి రైజర్లపై బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడటం అన్యాయమని అన్నారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసే వరకూ తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మలేరియాపై అవగాహన కల్పించాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ

బ్యానర్ ఆవిష్కరించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మలేరియా జ్వరాల పట్ల ప్రజలందరికీ విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని డిఎంహెచ్ఒ డి.ఆశ జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్‌కు సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ మలేరియా జ్వరాలు ప్రపంచంలో అన్ని దేశాల్లో ఉన్నాయని, ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో ఎక్కువ మంది మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారని అన్నారు. అశ్రద్ధ చేస్తే మరణాలు కూడా సంభవిస్తాయని హెచ్చరించారు. మలేరియా జ్వరాన్ని చలి జ్వరం అంటారని, ఈ జ్వరాలు అన్ని కాలాల్లో సంభవిస్తాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఎవరైనా తీవ్రమైన జ్వరం, చలి, వణుకుతోపాటు చెమటలు పడితే మలేరియా జ్వరమని అనుమానించి స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జూన్ నెల అంతా ప్రతి పిహెచ్‌సి, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మలేరియా చాలావరకు తగ్గుముఖం పట్టిందని, మలేరియాకు సంబంధించిన మందులు, పరీక్షలు ఉచితంగా అందజేస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ రత్నకుమారి, అధికారులు మురళీకృష్ణ, మనోరమ, నాగరత్నం, విజయ్, జె.గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీ జలకళ..!

ప్రభుత్వ నిబంధనలతో రైతులు బేజారు
కరెంటు కనెక్షన్లు లేక బోర్లు నిరుపయోగం

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధి హామీ కింద సన్న, చిన్నకారు రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రత్యేక బోర్లు ఏర్పాటు చేసే జలకళ కార్యక్రమం రైతులకు కలగానే మిగిలింది. ఈ పథకం అమలుకు ప్రభుత్వం తాజాగా విధించిన షరతులతో ఆశించిన లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. 2020లో మెట్ట ప్రాంతంలో కనీసంగా రెండున్నర ఎకరాల విస్తీర్ణం గల పొలం ఉన్న రైతులుగాని, రైతుగాని బోరు కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.6.50 లక్షల వ్యయంతో రైతుకు ఉచితంగా బోరు సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బోరు వేసేందుకు నిర్ణీత ప్రమాణాలు ఖరారు చేసిన తర్వాతే బోరు వేస్తామని అధికారులు ప్రకటించారు. మెట్ట ప్రాంతంలోని సన్న, చిన్నకారు రైతాంగానికి వ్యవసాయం కోసం బోరు వేసి సాగునీరు అందించడం ఉపయోగకరం కావడంతో రైతులంతా ఈ పథకం పట్ల ఆసక్తి కనబర్చారు. పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.నాలుగు లక్షల వ్యయంతో బోరు వేసి, పైపులైను అమర్చి కేసింగ్ పూర్తి చేయాల్సి ఉంది. బోరు వద్దకు విద్యుత్ సరఫరా కోసం అవసరమైన పోల్స్, కండక్టర్ల కోసం రూ.50 వేలు కేటాయించేవారు. ఇదేవిధంగా 7.50 హెచ్.పి. సామర్థ్యం గల మోటారును రూ.40 వేల వ్యయంతో అమర్చేందుకు సిద్ధం చేసేవారు. దీనిపై స్పందించిన మండలంలోని పలువురు రైతులు దరఖాస్తు చేసుకోగా వారిలో 72 మంది రైతులకు వారికి సంబంధించిన ఉమ్మడి వ్యవసాయ భూముల్లో బోర్లు వేసేందుకు ఉపాధి హామీ కార్యాలయం అనుమతులు ఇచ్చింది. ఇంతవరకు పొలసానిపల్లి, దుద్దేపూడి, అంబరుపేట, కోడూరుపాడు, పాక్షికంగా భీమడోలులోని మెట్ట ప్రాంతాల్లో ఇంతవరకు రూ.2.50 కోట్ల వ్యయంతో బోర్లను వేసి పైపులైన్లు కేసింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఇక రైతులు ఆ తరువాత విద్యుత్ కనెక్షన్ కోసం అధికారుల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం లబ్ధిదారులు వ్యవసాయ విద్యుత్‌ను సొంత బాధ్యతపై ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక్కో బోరుకు విద్యుత్ కనెక్షన్ కోసం రెండు లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని విద్యుత్ శాఖ అధికారులు అంచనా కట్టారు. అదేవిధంగా ఆ ప్రాంతాల్లో భూగర్భ నీటిమట్టం తక్కువగా ఉన్న నేపథ్యంలో 20 నుంచి 25 హార్స్ పవర్ సామర్థ్యం గల మోటార్లను ఏర్పాటు చేసుకుంటేనే బోర్లు పని చేస్తాయని భూగర్భ జల శాఖ తెలిపింది. వీటికి అదనంగా ప్రతి బోరు వద్ద లోఓల్టేజీ, ఇతర సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ తరహా షరతులతో బెంబేలెత్తిన లబ్ధిదారులు అంత ఖర్చు పెట్టి బోర్లను ఏర్పాటు చేసుకునే ఆర్థిక పరిస్థితి తమకు లేదంటూ బోర్ల ఏర్పాటుకు విముఖత చూపారు. దీంతో మండలంలో రూ.రెండున్నర కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన బోరు పనులు నిలిచిపోయాయి. ఇదే క్రమంలో కొందరు రైతులు చొరవ చూపి లక్షలాది రూపాయల వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కండక్టర్లుతోపాటు అధిక సామర్థ్యం గల మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇదేవిధంగా విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ తిరిగి వారిని ప్రసన్నం చేసుకుని విద్యుత్ కనెక్షన్లను పొందారు. ఈ తరహాలో మండల పరిధిలో బోర్లు కేటాయింపు జరిగిన 72 మందిలో పది మంది ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని బోర్లు నడుపుతున్నారు. వాటి ఆధారంగా వ్యవసాయం చేస్తున్నారు. దీనిపై ఉపాధి హామీ అధికారులను వివరణ కోరగా ప్రభుత్వం తాజాగా విధించిన షరతుల మేరకు విద్యుత్ కనెక్షన్లు, సరఫరా ఇతర కార్యక్రమాలను లబ్ధిదారులే చేపట్టాల్సి ఉందన్నారు. ఈ విషయాలపై ముందుకొచ్చిన రైతులకు తమ కార్యాలయపరంగా సహాయ సహకారాలు అందజేయడంతో పాటు విద్యుత్ శాఖాధికారులకు కనెక్షన్లు వెంటనే ఇవ్వాలని సిఫార్సు చేస్తున్నామన్నారు. జలకళ ద్వారా మెట్టప్రాంత రైతులకు వ్యవసాయం కోసం ఉచితంగా బోరు ఏర్పాటు చేసి ఆదుకుంటామన్న ప్రభుత్వం ఆ తర్వాత మాట మార్చడం సరికాదని, పథకాన్ని ప్రారంభించిన సమయంలో ప్రకటించిన రాయితీలను వర్తింపజేస్తూ బోర్లు వేసి తమకు అప్పగిస్తే వ్యవసాయం చేసుకుంటామని రైతులు అంటున్నారు.

ఏర్పాటు చేస్తున్న బోరు

విపత్తుల నుంచి పంట రక్షణకే ముందస్తు సాగు

బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, హోం మంత్రి వనిత
గోదావరి డెల్టా కాలువలకు నీరు విడుదల

బటన్ నొక్కి కాలువలకు నీటిని విడుదల చేస్తున్న మంత్రులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రకృతి విపత్తుల నుంచి పంటలను రక్షించుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు సాగుకు పిలుపునిచ్చిందని మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత అన్నారు. గురువారం ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టా కాలువలకు వారు నీటిని విడుదల చేశారు. తొలుత గోదావరికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్విచ్చాన్ చేసి గేట్లను పైకిలేపి దిగువకు గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడారు. ప్రస్తుతం మూడు డెల్టాలకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. గతేడాది ముందస్తు సాగును చేపట్టడం వల్ల సత్ఫలితాలు వచ్చాయన్నారు. ఇదే తరహాలో ఈ ఏడాదీ ముందస్తు సాగుకోసం నీటిని విడుదల చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రైతుల కోసం పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. జగన్ అధికారంలోకొచ్చిన నాటి నుంచి అన్ని రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగగా చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ముందస్తుగా నీటిని విడుదల చేయడం వల్ల సకాలంలో విత్తనాలు వేసేందుకు రైతులకు ఆస్కారం ఏర్పడిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్‌బికెల ద్వారా రైతులకు సాంకేతికపరమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సిఎం జగన్ ముందుచూపు వల్లే సకాలంలో సాగునీరు అందించడం సాధ్యమైందన్నారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ముందస్తు సాగుకోసం ఇప్పటికే ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన సమన్వయ కమిటీలను వేశామన్నారు. నీటి విడుదలకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేశామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత మంత్రులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గని భరత్, ఎంఎల్ఎలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, ఇరిగేషన్ సిఇ ఆర్.సతీష్‌కుమార్, ఎస్ఇ జి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సభ్యులు కె.తేజ, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమణరావు

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు

ప్రజాశక్తి - నిడమర్రు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనపల్లి ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం గోక సూరిబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా 1214 అధికారులకు ఇచ్చిన మెమోను రద్దు చేయాలని, రాజ్యాంగపరంగా ఏర్పడిన సంక్షేమ బోర్డు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు నిధులను వెనక్కివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోసూరు శివ, రోకల ఏసురెడ్డి, అలుమోలు బాలయ్య, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, తూర్పు రాము, అమ్మి రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరికి మాతృవియోగం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వెంకమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి చాట్రాయి మండల విలేకరి ఆడిమెల్లి లాజర్‌కు మాతృ వియోగం జరిగింది. ఆయన తల్లి ఆడిమెల్లి వెంకమ్మ(70) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ గురువారం మండలంలోని జనార్ధనవరంలోని స్వగృహంలో మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకమ్మ మృతి పట్ల ప్రజాశక్తి రాజమండ్రి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, డెస్క్ ఇన్‌ఛార్జి వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.గంగరాజు, జిల్లా బాధ్యులు పి.నారాయణరాజు, వై.సీతారాం సంతాపం తెలిపారు.

ధ్యానం గురించి విద్యార్థులకు వివరిస్తున్న పిరమిడ్ మహర్షులు రవిచంద్ర

25వ రోజుకు వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజ, ముదినేపల్లి శాఖల గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారంతో 25వ రోజుకు చేరాయి. ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పిరమిడ్ మహర్షులు రవిచంద్రచే ధ్యానం, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ చెప్పారు. అనంతరం విద్యార్థులతో ఇండోర్ గేమ్స్ ఆడించినట్లు గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎండి రజావుల్లా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పన్ను, పన్నేతరాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వీధి లైట్లు సక్రమంగా పనిచేసేటట్లు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం టి.నరసాపురం, కేతవరం, తెడ్లం, బండివారిగూడెం గ్రామ పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. టి.నరసాపురం సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎన్‌టి.స్వామి పాల్గొన్నారు.

గంగానమ్మ సన్నిధిలో ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని వింజరం శివారు రేపల్లెలో గంగానమ్మ దేవర నూతన ఆలయ, శిఖర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. గంగానమ్మ విగ్రహ ఆవిష్కరణను శాస్త్రోక్తంగా వేద పండితులు నడుమ ప్రతిష్ఠించారు. ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ గంగానమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ సంబరాలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచి ధర్మరాజుల నాగమ్మ, గోపవరం సర్పంచి ఉలిసి వసంత కుమారి, కైకలూరు సొసైటీ అధ్యక్షులు పంజా రాంబాబు, చేబోయిన వీర్రాజు, ఉలిసి శ్రీనివాసరావు, ధర్మరాజుల సూర్యనారాయణ, ఉలిసి శ్యామ్‌కుమార్, మీగడ శ్రీనివాసరావు, మాడపాటి చింతయ్య, ఉలిసి వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కాలువలోకి పల్టీ కొట్టిన కారు
వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తల్లాడ, దేవరపల్లి జాతీయ రహదారి జంగారెడ్డిగూడెం బైనేరు కాలువలోకి కారు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున జంగారెడ్డిగూడెం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు వంతెన సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి గట్టుపై నుంచి పడి పల్టీలు కొట్టడంతో కారు నుజ్జునుజ్జు అయ్యి డోర్లు లాక్ అయ్యాయి. కారులో ఉన్న తోకల హరిసూర్యనారాయణమూర్తి (46) కారులోనే మృతి చెందారు. స్థానికుల సహాయంతో పోలీసులు జెసిబితో కారు డోరు పగులగొట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. బైనేరు వంతెన వద్ద నూతన వంతెన నిర్మాణానికి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పనులు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు, ప్రమాద సంకేతాలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో మహిళ పెడపర్తి హైమావతి(25) హత్య కేసులో నిందితుడు గరికె కోటయ్యను పోలీసులు అరెస్టు చేశారు. హైమావతికి కోటయ్యకు వివాహేతరం సంబంధం ఉంది. ఈ క్రమంలో హైమావతిపై అనుమానంతో గరికె కోటయ్య కర్రలతో దాడి చేసి హైమావతిని హత్య చేశాడు. ఈ కేసులో కోటయ్యను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

స్కూటీపై పెళ్లికి వెళ్లి వస్తూ అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని రమనక్కపేట సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వంకవారిగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మహేష్, వినయ్‌లు స్కూటీపై గురువారం ద్వారకాతిరుమల పెళ్లికి వెళ్లారు. తిరిగి స్కూటీపై వంకవారిగూడెం బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని రమనక్కపేట వద్దకు వచ్చేసరికి స్కూటీ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఇద్దరు స్పృహ తప్పి కింద పడిపోయారు. స్థానికులు వారిద్దరిని 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి వివరాలు సేకరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

దాహం కేకలు.. ఎవరూ వినిపించుకోరు..!

ముదినేపల్లిలో అడుగంటుతున్న మంచినీటి చెరువులు
పసర్ల నీటితో ప్రజల అవస్థలు

అడుగంటిన్న సింగరాయపాలెం మంచినీటి చెరువు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎండలు మండిపోవడంతో మండలంలో జనం గొంతెండుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సూర్యుడు ఈ వేసవిలో తన ప్రతాపాన్ని చూపడంతో మంచినీటి చెరువుల్లో నీటిమట్టాలు తగ్గుముఖం పడుతున్నాయి. నీటిమట్టాలు తగ్గడంతో చెరువుల్లో నీరు వాసన వస్తూ, పసర్లుగా మారుతున్నాయి. పలు గ్రామాల్లో మూడు నుంచి ఐదు అడుగుల మేర నీటిమట్టాలు పడిపోయాయి. మండలంలో సగానికి పైగా చెరువుల్లో నీరు అడుగంటడంతో మండల ప్రజలు నీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో చేసేదిలేక మినరల్ నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 63,345 జనాభా ఉన్నారు. మండలవ్యాప్తంగా 34 రక్షిత మంచినీటి పథకాలు ఉండగా, వీటికి అనుబంధంగా 41 మంచినీటి చెరువులు ఉన్నాయి. అయినా మండలంలో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. భనుడి భగభగలకు చెరువుల్లో నీరు అవిరైపోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఏప్రిల్ 30 వరకు పంట కాలువల ద్వారా మంచినీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగినప్పటికీ ఎండలకు నెలరోజుల్లో మంచినీటి చెరువుల్లో నీటిమట్టాలు పడిపోయాయి. గతంలో మండల శివారు గ్రామాల్లో నీటి సమస్యలు ఉన్న గ్రామాలకు ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. అయితే ప్రస్తుతం అదీ ఎక్కడ జరగడం లేదు. దీంతో ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తాగుతున్నారు.

నీటిని కొనుగోలు చేస్తున్న మహిళలు

నీటి కోసం తిప్పలు

మండలంలో ఆక్వా సాగు విస్తరించిన కారణంగా గ్రామాల్లో మంచినీటి చెరువులు, మంచినీటి బావులు కలుషితమయ్యాయి. దీంతో తాగేందుకు మంచినీరు దొరకక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో మండలంలో అనేక గ్రామాల్లో నీటి సమస్యలు ఏర్పడ్డాయి. ఆయా గ్రామాల ప్రజలు దూరంగా ఉన్న ఇతర గ్రామాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. దూరం వెళ్లలేని మరికొందరు గ్రామాల్లోకి వ్యాన్ల ద్వారా విక్రయించే నీటిని కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని దేవరం, పేరూరు, దాకరం, చినపాలపర్రు, అత్తిమానుచెరువు, నాయుడుచెరువు, పలు గ్రామాల ప్రజలు ఐదారు కిలోమీటర్లు సైకిళ్లు, ద్విచక్రవాహనాలపై ముదినేపల్లి వెళ్లి నీటిని తీసుకువెళ్తున్నారు.

స్కీమ్‌లు ఉన్నా....

మండలంలోని 34 మంచినీటి స్కీమ్‌లు ఉన్నా, ఆ నీరు ప్రజలు తాగేందుకు ఏమాత్రం ఉపయోగకరంగా లేవు. పంచాయతీలు కుళాయిల ద్వారా సరఫరా చేసే నీరు కేవలం ఇళ్లల్లో వాడుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతోంది తప్ప తాగేందుకు పనికిరావు. నిధుల కొరతతో పంచాయతీలు స్కీమ్‌ల నిర్వహణ గాలికొదిలేశాయి. పలు గ్రామాల్లో ట్యాంకుల్లో కనీసం బ్లీచింగ్ కూడా కలపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్కీమ్‌ల ఫిల్టర్‌బెడ్స్ పాడైపోవడంతో నీటిని శుద్ధి చేయకుండా చెరువులో నుంచి సరాసరి ట్యాంకులోకి ఎక్కించి కుళాయిలకు వదులుతున్నారు. ఆ నీరు వాసన రావడంతో పాటు పసర్లుగా ఉండడంతో పలు గ్రామాల్లో ప్రజలు తాగేందుకు కాదు కదా, కనీసం ఆనీటిని వాడుకునేందుకు కూడా విముఖత వ్యక్తం చేస్తున్నారు. మరో 20 రోజుల వరకు పంటకాలువకు నీరు విడుదల చేసే పరిస్థితి కనబడడంలేదు. ఇప్పుడే మండలంలో నీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో అప్పటివరకు నీటి కష్టాలు తమకు తప్పేటట్లు లేవంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి

మండలంలో మంచినీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయలంటూ ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని దేవరం, చేవూరు, కోమర్రు, ఐనంపూడి, పేరూరు, దాకరం, చినపాలపర్రు, నాయుడుచెరువు, అత్తిమానుచెరువు, తేరగూడెం, రాఘువపురం, ఉప్పరగూడెం గ్రామాలతో పాటు నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి తమ దాహార్తిని తీర్చాలంటూ ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నీటి సమస్య లేదు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వి.వెంకటకృష్ణ

మండలంలో నీటి సమస్య లేదు. ఈ సారి ఏప్రిల్ 30 వరకు మంచినీటి చెరువులకు నీరు సరఫరా చేశాం. కార్యదర్శులు చెరువుల్లో నీటిని పూర్తిస్థాయిలో నింపారు. జూన్ 20 లోపు కాలువకు నీటిని వదిలే అవకాశం ఉంది. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

సిఐగా బాధ్యతలు చేపడుతున్న రాజేష్

జంగారెడ్డిగూడెం సిఐగా రాజేష్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.రాజేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జంగారెడ్డిగూడెం సిఐగా పని చేసిన బాలసురేష్‌బాబు విఆర్‌కు వెళ్లినట్లు సమాచారం. ఈ సందర్భంగా నూతన సిఐ పి.రాజేష్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా దృష్టి సారిస్తామని తెలిపారు. శాంతి భద్రతలు నెలకొల్పడానికి కృషి చేస్తానని తెలిపారు.

'గోవిందరావు అరెస్టు దారుణం'

ప్రజాశక్తి - చింతలపూడి

జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావును అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని జనసేన మండల అధ్యక్షులు చిదారాల మధుబాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి నాయకులు వివాదాస్పదంగా పెట్టిన ఫ్లెక్సీలను తొలగించమని కోరుతూ వినతిపత్రం ఇచ్చినందుకు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ అరెస్టును ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

చేనేత కార్మికులు ఐక్యం కావాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్రంలో 20 లక్షల మంది పైబడి ఉన్న చేనేత కార్మికులను ప్రభుత్వం విస్మరిస్తున్నందున చేనేత కార్మికులు చైతన్యవంతులు కావాలని పద్మశాలి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వానపల్లి నాగరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కార్మికులను ఓట్లు వేసే ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారే తప్ప రాజకీయంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడంలేదన్నారు. దీనికి వ్యవస్థలో లోపాలే కారణమన్నారు. చేనేత కులాల్లో మార్పు రావాలన్నారు. నేత నేసే నేతకు గిట్టుబాటు ధర లేక ఆకలితో అలమటిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల్లో ముడి పదార్థాలు, నూలు రసాయనాలపై రాయితీ ఇచ్చారన్నారు. ఇప్పుడున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ పోయి జిఎస్‌టి పేరుతో నేతన్నల నడ్డి విడుస్తున్నారన్నారు. చేనేతల ఓట్లు ఏలూరులో 25 వేల పైపడే ఉన్నాయన్నారు. పత్తేబాద, శనివారపుపేట, తూర్పు వీధి ఎన్నో మగ్గాలు ఉండేవి. ప్రభుత్వాలు భారతదేశ సంపదను, కళాకారులను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. మన చేనేత కులాల్లో ఐక్యత రానంతవరకు ఏం చేయమలేమన్నారు. చేనేత కార్మికులందరూ చైతన్యవంతులు కావాలన్నారు. ఈ నెల 19వ తేదీన పోరాటం చేస్తున్నామని తెలిపారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి - మండవల్లి

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఆనంద్‌కుమార్

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి సంపదను తయారుచేసి గ్రామానికి ఆదాయం సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ బి.ఆనంద్‌కుమార్ కార్యదర్శికి సూచించారు. మండలంలోని ఇంగిలంపాకలంక గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు సంపద కేంద్రానికి తరలించాలన్నారు. దీంతో స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అంతేకాకుండా కేంద్రానికి తరలించిన చెత్తను సంపద తయారీకి వినియోగించుకుని సంపద కోసం ఎరువును తయారు చేయాలన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి సచివాలయానికి సంబంధించిన రిజిస్టర్‌లను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఎపి సేవా సర్వీసులపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇకనుంచి శ్రీవారి దేవస్థానం నిర్వహణలో ఫలహార శాల

ఫలహార శాల

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన శ్రీ పద్మావతి ఫలహారాలశాల కొండపై ప్రసాదాల కౌంటర్ల గురువారం ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వారి నిర్వహణలో ప్రారంభించారు. ఇంతకు ముందు ప్రయివేట్ నిర్వహణలో ఉన్న ఈ క్యాంటీన్ అధిక ధరలతో భక్తులకు భారంగా ఉండేది. ప్రస్తుతం దేవస్థానం వారు ప్రారంభించడం వల్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ క్యాంటీన్ సరసమైన ధరల్లో దేవస్థానం వారు సుదీర్ఘ కాలం పాటు నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కైకలూరు


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు

విశ్వబ్రాహ్మణ సంఘ సేవలు అభినందనీయమని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. బ్రాహ్మం ఆలయం వద్ద నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమములో వైసిపి మండల అధ్యక్షులు భట్రాజు శివాజీ, ఎంపిటిసి సభ్యులు జంపన కొండరాజు, నియోజకవర్గ విశ్వబ్రాహ్మణుల సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర విభజన సందర్భంగా పది సంవత్సరాలలో విభజన హామీ చట్టాన్ని అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని పార్లమెంటులో తీర్మానించినా ఈ తొమ్మిదేళ్లలో పై హామీలు ఏ ఒక్కటి అమలు జరగలేదని ఎంసిపిఐ (యు) రాష్ట్ర కమిటీ కార్యదర్శి కాటం నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమ్యూనిస్టు, వామపక్ష, బహుజన, గిరిజన, దళిత, మైనార్టీల పార్టీలను, సంఘాలను, సంస్థలను కలుపుకొని ప్రజా ఐక్య సంఘటన లేక ప్రజా ఐక్య వేదిక ఏర్పాటు చేసేందుకు ఈ నెల 14న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రెస్‌క్లబ్, గాంధీ నగరం, విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'వైష్ణవి' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఎన్‌ఆర్‌పేటలో వైష్ణవి జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పిడిఎస్‌యు నగర కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌ఐఒ కె.చంద్రశేఖర్ బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు నగర అధ్యక్షుడు క్రాంతి మాట్లాడుతూ కొంతకాలంగా ఎస్‌విఆర్‌కె జూనియర్ కళాశాల పేరుమీద నడుస్తున్న కళాశాలను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి, అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే ఉన్నట్టుండి వైష్ణవి జూనియర్ కళాశాలగా పేరు మార్చి అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రంగా ఉన్న ఏలూరులో ఒక కళాశాల పేరు మార్చి అడ్మిషన్లు చేస్తున్నా ఆర్‌ఐఒ ఏం చేస్తున్నారని క్రాంతి ప్రశ్నించారు. పాత కాలేజీ పేరు మీద అడ్మిషన్లు చేస్తున్నారా లేకపోతే కొత్త కాలేజీకి పర్మిషన్ ఇచ్చారో ఆర్‌ఐఒ స్పష్టం చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంకా పేరు మారకుండానే పాంప్లెట్లు వేసి ఫ్లెక్సీలు వేసి ప్రచారం చేయడం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ రూల్స్ వ్యతిరేకమన్నారు. వెంటనే ఈ విషయమై కళాశాలపై శాఖా పరమైన విచారణ జరిపి రూల్స్‌కి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందున యాజమాన్యంపై చలానా విధించి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.తేజ, కె.రాజు పాల్గొన్నారు.

కార్యాలయ భవనాల పేరు మార్పు సరికాదు : టిడిపి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ కార్యాలయ భవనానికి, హెల్త్ యూనవర్సిటీకి నందమూరి తారకరామారావు పేరును తొలగించి వైఎస్‌ఆర్ పేరు పెట్టడంతో వైసిపి ప్రభుత్వం దుష్టసంప్రదాయాన్ని ప్రవేశపెట్టిందని చింతలపూడి నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీరామకృష్ణ అన్నారు. స్థానిక పట్టణ టిడిపి కార్యలయంలో పార్టీ పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కార్యాలయాలకు, కొత్త ప్రాజెక్టులకు, వైఎస్‌ఆర్ పేరు పెట్టుకోవచ్చని, గతంలో ఉన్న ఎన్‌టిఆర్ పేరును తొలగించి వైఎస్‌ఆర్ పేరు పెట్టడం సరికాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, బిసి నాయకులు రాజన సత్యనారాయణ, టిడిపి మున్సిపల్ కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, తెల్లగారపు జ్యోతి, టిడిపి నాయకులు పరిమి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, పాతూరి అంబేద్కర్, గంట శ్రీను, పాకలపాటి రవి, మద్దిపాటి ఉదయ్, నాయుడు శ్రీను , అల్లూరి రామకృష్ణ గోరీక దాసు, కాసాని ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కోరుకొల్లు పాటిమీద శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానం ముఖ మండపం నిర్మాణానికి దాత ఎన్‌ఆర్‌ఐ వర్రే వెంకట సత్యనారాయణ రూ.5 లక్షలు విరాళం ప్రకటించినట్లు ట్రస్ట్ కార్యదర్శి చన్నంశెట్టి కృష్ణ తెలిపారు. ముఖ మండపాన్ని రూ.30 లక్షలతో నిర్మాణం పూర్తిచేసేలా ఛైర్మన్ చన్నంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, వంగూరు గ్రామ కాపురస్తులైన మద్దుల జార్జ్, S/o. పోతురాజు (లేటు) తెలియచేయునది ఏమనగా, సర్వే నెం. 157-1, డాక్యుమెంట్ నెం. 2844/1996 గల పొలం దస్తావేజులును జిరాక్స్ నిమిత్తం వంగూరు నుండి ఏలూరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో జారి పడిపోయినవి. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

మద్దుల జార్జ్
సెల్: 9963806596

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, నడిపూడి గ్రామ కాపురస్తురాలైన కట్టా శ్రీను భార్య అయిన కట్టా వెంకటలక్ష్మి **Passport No. P7895363** రుతో Passport కలిగియున్నాను. ది. 30-04-2023వ తేదీన ఆటోలో పెనుమంట్ర గ్రామం నుండి మార్టేరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఎక్కడో పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కట్టా వెంకటలక్ష్మి, W/o. కట్టా శ్రీను
డోర్ నెం. 2-72, నడిపూడి
పెనుగొండ మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్‌కోడ్: 534123, సెల్: 8499829978

CHANGE OF NAME

I, **VEMULAPALLI SARAT CHANDRA BOSE**, S/o. Vemulapalli Lakshmaiah, and Residing @ D.No. 13-193, MIG-151, APHB Colony, Vatluru, Pedapadu, Eluru (R) -534007. Changing my Name **VEMULAPALLI SARAT CHANDRA** (Old Name) to **VEMULAPALLI SARAT CHANDRA BOSE** (New Name), S/o. Vemulapalli Lakshmaiah. Hence, forth I am being called as **VEMULAPALLI SARAT CHANDRA BOSE** for All purposes.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, మాముదూరు గ్రామం, బొక్కావారి పాలెం గ్రామ కాపురస్థుడైన దొంగ శ్రీను, తండ్రి: సుబ్బారావు అను నాకు **G6838890** నెంబరు గల పాస్‌పోర్టు గత నెల ది. 01-05-2023వ తేదీన మోటారు సైకిల్‌పై మాముదూరు గ్రామం నుండి బ్రాహ్మణచెర్వు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఎక్కడో పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు ఎక్కడో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

దొంగ శ్రీను, తండ్రి: సుబ్బారావు,
డోర్ నెంబర్: 2-113-1, బొక్కావారిపాలెం
మాముదూరు గ్రామం, పెనుమంట్ర మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్‌కోడ్: 534230
సెల్: 9908382707

లింకు డాక్యుమెంట్ దస్తావేజు పోయినది

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీమతి కోమలి లక్ష్మి, భర్త: శ్రీను గారికి తాడిపర్రు గ్రామంలో గల డాక్యుమెంట్ నెం. 8614/2019 హక్కు విడుదల దస్తావేజు పొందియుండెను. సదరు ఆస్తి గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, తణుకు బ్రాంచ్ నందు ఋణం తీసుకొనుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజినల్ రిజిష్టర్ దస్తావేజు నెం. 5967/2011, ఈ లింకు దస్తావేజు జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్ళుచుండగా ఈ దస్తావేజు కవరు తప్పిపోయినది. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ దొరికినవారు ఈ దిగువ ఇవ్వబడిన నా క్లయింట్ చిరునామాకు వాపస్ చేయగలరు.

పార్టీ వివరములు: పేరు: కోమలి లక్ష్మి, W/o. శ్రీను, డో.నెం. 1-40/2, తాడిపర్రు, ఉండ్రాజవరం మండలం.

A.NAGESWARA RAO
Advocate & Notary
Tanuku, Cell: 9110382946

పురపాలక సంఘ కార్యాలయం, నరసాపురం

ఆర్.ఓ.సి. నెం. 175/2023/ఇ2, తేది:01-06-2023

వేలం ప్రకటన

నరసాపురం పురపాలక సంఘ పరిధిలోని 2వ వార్డు హెడ్ వాటర్ వర్క్స్ నందు గల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోని చేపలను పట్టుకొను హక్కులు పొందుటకు బహిరంగ వేలము ది. 08-06-2023వ తేది మధ్యాహ్నం గం॥ 3.30 ని॥లకు ఈ కార్యాలయము నందు కమిషనరు వారు లేదా వారి అనుమతి పొందిన అధికారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. అందు పై సదరు పాటలో పాల్గొను అభ్యర్థులు ధరావత్తుగా రూ. 25,000/-లు నగదుగా డిపాజిట్ చేసి పాటలో పాల్గొనవచ్చును. పూర్తి సమాచారం కొరకు ఈ కార్యాలయ పని వేళల యందు ఈ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమిషనరు**
నరసాపురం పురపాలక సంఘం

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ, కోటా రామచంద్రపురం, ఏలూరు జిల్లా

ఆర్.సి. నెంబర్: 3/టెండర్స్/2023-24 **టెండరు ప్రకటన** తేదీ: 31-05-2023

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ, కోటా రామచంద్రపురం, ఏలూరు జిల్లా పరిధిలో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు మరియు కళాశాలలు నందు గల గురుకుల వసతి గృహములకు 2023-24 విద్యాసంస్థలకు కూరగాయలు, పాలు, పండ్లు, చికెన్, మటన్, స్వీట్, హాట్ సరఫరా చేయుటకు వ్యక్తులు మరియు సంస్థల నుండి సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి.

టెండర్లు దాఖలు చేయదలచిన వారు నియమ నిబంధనలతో కూడిన టెండర్ షెడ్యూల్స్ ఒక్కొక్క దానికి రూ. 500/- చొప్పున ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలురు), కోట రామచంద్రపురం నందు తేదీ. 31-05-2023 నుండి తేదీ. 07-06-2023 మధ్యాహ్నం 12.00 గంటలకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండర్ షెడ్యూల్స్ తేదీ. 07-06-2023 మధ్యాహ్నం 1.00 గంటలోగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలురు), కోట రామచంద్రపురం వారి వద్ద ఉంచబడిన టెండర్ బాక్స్ నందు నిర్ణయించిన ఇ.యం.డి.తో పాటుగా వేయవలెను. స్వీకరించిన టెండర్ షెడ్యూల్స్ తేదీ. 08-06-2023 మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండర్ దారుల సమక్షంలో శ్రీయుత ప్రాజెక్ట్ అధికారి గారు, ఐ.టి.డి.ఎ., కె.ఆర్.పురం మరియు జిల్లా కార్యదర్శి, గురుకులం, ఏలూరు జిల్లా వారి కార్యాలయం నందు తెరిచి ఖరారు చేయబడును.

◆ ఏ కారణము తెలపకుండా టెండర్లు రద్దు చేయుటకు మరియు తేదీని పొడిగించుటకు కమిటీ వారికి అధికారం కలదు.

సం/- **ప్రాజెక్ట్ అధికారి/ జిల్లా కార్యదర్శి,** ఐ.టి.డి.ఎ., కె.ఆర్.పురం, ఏలూరు జిల్లా